బుధవారం గాంధీభవన్ వద్ద రోడ్డుపై బైఠాయించి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న జీవో నంబర్ 317 బాధితులు

స్వరాష్ట్రంలో స్థానికులకు అన్యాయమా?

- 48 గంటల్లోనే సమస్యను పరిష్కరిస్తానన్న సీఎం ఎక్కడ?
- గాంధీ భవన్‌ను ముట్టడించి, బైఠాయించిన జీవో 317 బాధితులు

హైదరాబాద్/సుల్తాన్‌బజార్,అక్టోబర్ 2: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే జీవో నంబర్ 317 బాధితులకు న్యాయం చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి పది నెలలు గడిచినా.. పట్టించుకోవడం లేదంటూ బాధితులు బుధవారం గాంధీభవన్‌ను ముట్టడించారు. రోడ్డుపై బైఠాయించడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ సందర్భంగా 317 బాధితులు మాట్లాడుతూ.. స్థానికత మీద ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో స్థానికులకు అన్యాయం చేస్తారా..? అని ప్రశ్నించారు. 'నా కంటే ముందు ఉద్యోగం పొందిన వారు స్థానికులు, నా తరువాత డీఎస్‌సీ-2024 ఉద్యోగం పొందబోయే వారూ స్థానికులే మరి నా స్థానికత ఎక్కడ సీఎం' అని ఓ 317 బాధితుడు బ్యాసర్‌ను ప్రదర్శిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించాడు. గాంధీ జయంతి రోజున గాంధీ సాక్షిగా జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని బాధితులు కోరారు.

కొత్త పింఛన్లు ఇస్తలేరు బాపూ..

'కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 10 నెలలవుతున్నా కొత్తగా ఆసరా పింఛన్లు మంజూరు చేయట్లేదు బాపూ' అంటూ ఖమ్మంలోని పలువురు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఆయన చిత్రపటానికి వినతిపత్రం అందజేసి వినూత్న నిరసన తెలిపారు. దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. – ఖమ్మం

పంచాయతీ సిబ్బందికి పాద పూజ

గాంధీ జయంతి సందర్భంగా బుధవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో ఖాజామొహీనుద్దీన్ పంచాయతీ సిబ్బంది పాదాలు కడిగి సన్మానించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు.

– చిగురుమామిడి

వైభవంగా ఎంగిలిపూల బతుకమ్మ

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బుధవారం బతుకమ్మ వేడుకలు అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. వరంగల్, హనుమకొండ, జనగామ, ములుగు, మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాల్లోని అన్ని గ్రామాల్లో మహిళలు మధ్యాహ్నం ఎంగిలిపూల బతుకమ్మను పేర్చారు. సాయంత్రం బతుకమ్మలతో స్థానికంగా ఉన్న ఆలయాలు, ప్రధాన కూడళ్ల వద్దకు చేరుకొని పాటలు పాడుతూ వేడుకలు జరుపుకొన్నారు. హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయానికి వేలాదిమంది మహిళలు బతుకమ్మలతో తరలివచ్చి ఆడిపాడి సందడి చేశారు. వర్షం కురిసినా ఆడపడుచులు తడుస్తూనే వేడుకలు నిర్వహించారు. – వరంగల్

నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్

చీకట్లోనే బతుకమ్మ సంబురాలు

- వీధి దీపాలు వెలుగక అవస్థలు
- మంత్రి సీతక్క ఇలాకాలో ఈ దుస్థితి

ములుగు, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ సంబురాలను ఆడబిడ్డలు చీకట్లోనే జరుపుకోవాల్సి వచ్చింది. ఈ ఘటన ములుగు నియోజకవర్గ పరిధిలోని వెంకటాపూర్ మండలం చింతలపల్లిలో చోటు చేసుకున్నది. దాదాపు 40 మంది మహిళలు గ్రామ ప్రధాన కూడలి వద్ద బుధవారం ఎంగిలిపూల బతుకమ్మను చీకట్లోనే ఆడుకోవాల్సి వచ్చింది. 15 రోజులుగా వీధి లైట్లు వెలుగడం లేదని పంచాయతీ కార్యదర్శి కవితకు చెప్పినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా బతుకమ్మ వేడుకలను మహిళలు మొబైల్ లైట్లు, ద్విచక్రవాహనాల హెడ్‌లైట్లు, బతుకమ్మలపై వెలిగించిన దీపాల వెలుగులోనే 2 గంటలపాటు ఆడాల్సి వచ్చింది. ఈ గ్రామం నియోజకవర్గ పరంగా మంత్రి సీతక్క పరిధిలో ఉండగా జిల్లాపరంగా జయశంకర్ భూపాలపల్లి పరిధిలోకి వస్తుంది. ఇదిలావుండగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం పెద్దంపల్లి గ్రామంలోనూ మహిళలు చీకట్లోనే బతుకమ్మ ఆడాల్సి వచ్చింది. 'కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరలు ఇవ్వలేదు.. కనీసం బతుకమ్మ ఆడుకునేందుకు లైట్లు కూడా వేయలేదు' అంటూ సోషల్ మీడియా వేదికగా పోస్టులు చేసి ప్రభుత్వానికి చురకలు అంటించారు.

వెంకటాపూర్ మండలం చింతలపల్లిలో చీకట్లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బతుకమ్మ ఆడుతూ మహిళ మృతి

స్వరూప (ఫైల్)

ముత్తారం, అక్టోబర్ 2: పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం లక్కారం గ్రామానికి చెందిన మాదాసి స్వరూప (45) బుధవారం సాయంత్రం బతుకమ్మ ఆడుతూ ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందింది. స్వరూప గతంలో మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడినట్టు స్థానికులు తెలిపారు. అదే వ్యాధితో చనిపోయిందా? లేక గుండెపోటు వచ్చి మృతి చెందిందా? అనేది తెలియాల్సి ఉంది. స్వరూప ఇద్దరు కూతుళ్లు వివాహాలు జరిపించగా.. భర్త పదేండ్ల క్రితమే మృతిచెందినట్టు స్థానికులు తెలిపారు.

స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల జాబితాలేవి ?

- ఇంకా విడుదల చేయని విద్యాశాఖ
- ఆందోళనలో అభ్యర్థులు

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ ఫలితాలు ప్రకటించిన రోజే జాబితాలు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించగా, అధికారులు మాత్రం విడుదల చేయలేదు. ఓవైపు సర్టిఫికెట్ వెరిఫికేషన్ గడువు సమీపిస్తుండగా, బుధవారం వరకు స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల 1:3 జాబితా విడుదల కాలేదు. మంగళవారం రాత్రి ఎస్జీటీ 1:3 జాబితా విడుదల కాగా, బుధవారం రాత్రి స్కూల్ అసిస్టెంట్, భాషాపండితులు, పీఈటీ పోస్టుల జాబితాలను అధికారులు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

తొలిరోజు ముగిసిన వెరిఫికేషన్

కొన్ని జిల్లాల్లో స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు తొలిరోజు సర్టిఫికేషన్ వెరిఫికేషన్ నిర్వహించారు. అధికారుల సమన్వయ లోపంతో అభ్యర్థులకు ఇబ్బందులు ఎదురయ్యారు. కొంతమంది అభ్యర్థులకు అకనాలెడ్జ్‌మెంట్ సర్టిఫికెట్ ఇవ్వగా మరికొన్ని జిల్లాల్లో ఇవ్వలేదు.

రైల్వేలో జాబ్స్ ఇప్పిస్తామని మోసం

- 87లక్షలు వసూలు చేసినముఠా
- సీసీఎస్‌లో కేసు నమోదు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 2(నమస్తే తెలంగాణ): రైల్వేలో ఉద్యోగాలిప్పిస్తామంటూ నమ్మించిన ఒక ముఠా రూ.87 లక్షలు వసూలు చేసి బాధితులను మోసగించింది. సీసీఎస్ పోలీసుల కథనం ప్రకారం.. తెలంగాణ సీఎంవోలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న బాగ్‌అంబర్‌పేట్‌కు చెందిన మధుకు దగ్గరి బంధువు ప్రశాంత్ ద్వారా కృష్ణానగర్‌లో నివాసముండే బండారు రామ్‌కుమార్‌తో పరిచయమైంది. రైల్వేలో క్లర్కు, కమర్షియల్ క్లర్క్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ రామ్‌కుమార్ నమ్మించాడు. మధుతోపాటు బంధువులు ఉద్యోగాల కోసం రామ్‌కుమార్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులకు పలు దఫాలుగా 87లక్షలు అందజేశారు. క్లర్కు పోస్టులకు ఎంపికైనట్టు ఈమెయిల్, పోస్టు ద్వారా బాధితులకు అపాయింట్‌మెంట్ లెటర్లు పంపించారు. అవన్నీ నకిలీవంటూ రైల్వే అధికారులు తేల్చడంతో బాధితులు సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆర్టీసీలో అన్ని ఎలక్ట్రిక్ వాహనాలే

- ఫ్యూచర్ సిటీలో ఫ్యూయల్ సెల్ పరిశ్రమ
- తోషిబా సంస్థను కోరిన డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రికల్ బస్సులుగా రూపుదిద్దుతామని, ఇందుకు తోషిబా సంస్థ సహకరించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. జపాన్ పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు ఇతర ప్రతినిధి బృందం ఎలక్ట్రానిక్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి సంస్థ తోషిబా ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. ఫ్యూచర్ సిటీలో ఫ్యూయల్‌సెల్ టెక్నాలజీ యూనిట్ ఏర్పాటుకు ముందుకురావాలని తోషిబా ప్రతినిధులను భట్టి కోరారు. లిథియం బ్యాటరీల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న తోషిబా సింగరేణి సంస్థతో కలిసి ముందుకు సాగాలని సూచించారు. తెలంగాణలో తోషిబాను మరింత విస్తరిస్తామని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు.

సీపీఎస్ఈయూ అధ్యక్షుడిగా దర్శన్

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఉద్యోగుల సంఘం(టీజీ సీపీఎస్ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడిగా లింగమొల్ల దర్శన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఉప్పరి విజయ్‌భాస్కర్ ఎన్నికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో గౌరవాధ్యక్షుడిగా రామకృష్ణ, అసోసియేట్ అధ్యక్షుడిగా సందీప్, ఎస్ రామదాసు, కోశాధికారిగా మారం లింగారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎల్ వీరేశం, వీ నర్సింహులు, భూలక్ష్మి, జాయింట్ సెక్రటరీగా ఎన్ ఉపేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా తిరుపతి, శోభన్, శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

భాషాపండితులకు పదోన్నతులు కల్పించాలి

ఎస్ఎల్‌టీఏ డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): పదోన్నతుల్లో భాగంగా మిగిలిపోయిన భాషాపండితులకు సైతం పదోన్నతులు కల్పించాలని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ తెలంగాణ స్టేట్ (ఎస్ఎల్‌టీఏ టీఎస్) ప్రభుత్వాన్ని కోరింది. సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం హైదరాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఇకపై భాషా సేవకు అంకితమై పనిచేస్తామని అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కే గౌరిశంకర్‌రావు తెలిపారు.

రైతు తరహాలో కార్మిక బీమా ఇవ్వండి

- అసంఘటితరంగ కార్మికులకు అమలు చేయాలి
- ప్రభుత్వానికి పరిశ్రమ వర్గాలు, కార్మికుల వినతి

హైదరాబాద్, అక్టోబర్ 2(నమస్తే తెలంగాణ): చిన్న పరిశ్రమల్లో పనిచేస్తున్న అసంఘటితరంగ కార్మికులకు రైతు బీమా తరహాలో బీమా సౌకర్యం కల్పించాలని పరిశ్రమ వర్గాలు, కార్మికవర్గ నేతలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. హైదరాబాద్ శివార్లలోని వేలాది పరిశ్రమల్లో లక్షలాది మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీరికి పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు లేవని ఎంఎస్ఎంఈ సంఘం నాయకులు తెలిపారు. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు సహజంగా తాత్కాలిక పద్ధతిలో కార్మికులను నియమించుకుంటాయి. వీరిలో ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఎక్కువగా పనిచేస్తున్నారు. మార్కెట్‌లో ఎదురయ్యే పోటీ, వ్యాపారం సరిగా సాగకపోవడం వంటి కారణాలతో కార్మికులకు వేతనాలు కూడా అంతంత మాత్రంగానే ఇస్తారు. వీరిలో బీహార్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి పొట్టచేత పట్టుకొని వచ్చేవారే ఎక్కువ. పరిశ్రమలో కానీ, బయట రోడ్డుపై కానీ ఎటువంటి ప్రమాదం జరిగినా, ఆరోగ్య సమస్యలు తలెత్తి మరణించినా వారిని ఆదుకునే నాథుడే లేడు. దీంతో కార్మికులకు బీమా సౌకర్యం వర్తింపజేయాలని, ఒకవేళ ప్రీమియం ప్రభుత్వం చెల్లించకపోతే ఆయా పరిశ్రమల ద్వారా చెల్లించేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్టు పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

డెంగ్యూతో యువతి మృతి

కల్యాణి (ఫైల్)

చెన్నారావుపేట, అక్టోబర్ 2: డెంగ్యూతో యువతి మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లిలో బుధవారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన సంగెం దేవేందర్-రమ దంపతుల కూతురు కల్యాణి (20) పీజీ చదువుతున్నది. కొద్దిరోజుల క్రితం జ్వరం రావడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించగా పరీక్షలు నిర్వహించి డెంగ్యూగా నిర్ధారించారు. జ్వరం తీవ్రమై ప్లేట్‌లెట్స్ తగ్గడంతో బుధవారం ఉదయం మృతి చెందింది.

పెండ్లి కుదరడం లేదని

ఎక్సైజ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

దేవేందర్‌రెడ్డి (ఫైల్)

వీణవంక, అక్టోబర్ 2: పెండ్లి కావడం లేదని, సంబంధాలు కుదరడం లేదని ఎక్సైజ్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా వీణవంక మండలం ఎలుబాకలో జరిగింది. ఎలుబాకకు చెందిన బొల్లం దేవేందర్‌రెడ్డి (27) నాలుగేండ్లుగా హుజూరాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఉద్యోగం వచ్చినా పెండ్లికాకపోవడం, సంబంధాలు కుదరకపోవడంతో మానసికంగా కుంగిపోయాడు. జీవితంపై విరక్తిచెంది మంగళవారం రాత్రి గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు, తర్వాత ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉందని ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

ఈఆర్సీలో 11 ఉద్యోగాల భర్తీ

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): తెలంగాణ విద్యుత్తు నియంత్రణ మండలి(ఈఆర్సీ)లో 11 ఉద్యోగాలను భర్తీచేశారు. ఈ ఉద్యోగాల భర్తీకి మార్చిలో నోటిఫికేషన్ జారీచేయగా, నియామక ప్రక్రియను పూర్తిచేసిన కమిషన్ పోస్టులకు ఎంపికైన వారి జాబితా విడుదల చేసింది. మిగతా ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు జరుగుతున్నట్టు ఈఆర్సీ వెల్లడించింది.

తెలుగు అకాడమీ పుస్తకాలను ప్రామాణికంగా తీసుకోలేం!

- అవి రన్నింగ్‌నోట్స్ మాత్రమే.. రెఫరెన్స్ పుస్తకాలేం కావు
- ఎలాంటి రీసెర్చ్ చేయకుండా రాశారు.. అవి గైడ్ మాత్రమే
- హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో టీజీపీఎస్సీ

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): తెలుగు అకాడమీ ముద్రించిన పుస్తకాల్లో పసలేదని.. అంతా డొల్లేనని టీజీపీఎస్సీ తేల్చింది. ఈ పుస్తకాలు పోటీపరీక్షలకు పనికిరావని, వీటిని ప్రామాణికంగా తీసుకోలేమని పేర్కొన్నది. అకాడమీ ముద్రించిన పుస్తకాలు రన్నింగ్ నోట్స్‌లా ఉన్నాయని, ఎలాంటి రీసెర్చ్ చేయకుండా రాశారని, ఇవి కేవలం గైడ్‌లా మాత్రమే ఉపయోగపడతాయని స్పష్టంచేసింది. ఈ అంశాలను పేర్కొంటూ ఇటీవలే టీజీపీఎస్సీ హైకోర్టులో ఆఫిడవిట్ సమర్పించింది. ఒక ప్రభుత్వ రంగ సంస్థ ముద్రించిన పుస్తకాలను ఒక చట్టబద్ధమైన సంస్థ అంగీకరించబోమని చెప్పడంతో నిరుద్యోగుల్లో ఆందోళన నెలకొన్నది. ఇప్పటికే తెలుగు అకాడమీ పుస్తకాలను చదివిన వారు ఏం చేయాలో తోచక తలలుపట్టుకుంటున్నారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ ఫైనల్ 'కీ'లోని నాలుగు ప్రశ్నల ఆన్సర్లపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఐదుగురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. 68,79, 106, 112 ప్రశ్నల సమాధానాలపై వారు అభ్యంతరాలు వ్యక్తంచేశారు. ఇందుకు తెలుగు అకాడమీ ప్రచురించిన తెలంగాణ హిస్టరీ-కల్చర్ 2016, తెలంగాణ రీజినల్ జాగ్రఫీ, పుస్తకాలను రెఫరెన్స్‌గా పేర్కొన్నారు. ఈ పుస్తకాల్లోని అంశాల ఆధారంగా ఫైనల్ 'కీ'లో మార్పులు చేయాలంటూ కోర్టు మెట్లెక్కారు. దీంతో తెలుగు అకాడమీ ముద్రించిన పుస్తకాల్లో ఎలాంటి రెఫరెన్స్‌లు లేవని, రీసెర్చ్‌వర్క్ చేయలేదని పలు అభ్యంతరాలతో టీజీపీఎస్సీ ఇటీవలే హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. తెలంగాణ హిస్టరీ-కల్చర్ 2016 పుస్తకంలో 33 చాప్టర్లతో.. పూర్వ చారిత్రక కాలం నుంచి ఆధునిక కాలం వరకు అనేక వాస్తవాలను స్ఫురించారు. 16 మంది అకాడమిషన్లు రూపొందించగా, ముగ్గురు సీనియర్ అకాడమిషన్లు ఎడిట్ చేశారు. ఏ పాఠాన్ని ఏ అకాడమిషన్ రచించారో వ్యక్తపరచలేదని అఫిడవిట్‌లో పేర్కొన్నది.

టీజీపీఎస్సీ అభ్యంతరాలివే..

- పాఠ్యాంశాల్లో ప్రస్తావించిన అంశాలకు రెఫరెన్స్ పేర్కొనలేదు. ప్రామాణిక మూలాలేంటో(సోర్స్) వెల్లడించలేదు.
- మొత్తం పుస్తకంలో, పేజీల్లోనూ అధికారమైన మూలాలను ఉదహరించలేదు. ఫుట్‌నోట్స్ లేవు.
- పుస్తకంలో ముద్రించిన అంశాలు పరిశోధన (రీసెర్చ్‌వర్క్) ఆధారంగా లేవు.
- ఈ పుస్తకాల్లో ఎక్కువగా రన్నింగ్ నోట్స్ రూపంలో రాశారు. వివిధ మూలాల నుంచి సేకరించిన అంశాలను, విషయాలను సంకలనం చేసి వివిధ అధ్యాయాల కింద కూర్చుపేశారు.
- ఈ పుస్తకం డిగ్రీ, పీజీ ఏ కోర్సుల్లోనూ పాఠ్యపుస్తకాలుగా సూచించబడలేదు.
- ఈ పుస్తకం ప్రామాణిక పాఠ్యపుస్తకం, రెఫరెన్స్‌బుక్‌లా కాకుండా కేవలం గైడ్‌గా మాత్రమే ఉపయోగపడుతుంది.

బిడ్డర్లతో అధికారుల మిలాఖత్?

- పౌరసరఫరాల సంస్థపై ఆరోపణల వెల్లువ
- బిడ్డర్లకు గడువు పొడగింపులో ఆంతర్యమేమి?
- ధాన్యం ఎత్తకపోయినా ఎందుకా ఉదాసీనత?
- 35 లక్షల టన్నుల ధాన్యంలో ఎత్తింది 10 లక్షలే
- ప్రతి నెలా 50 కోట్ల చొప్పున 500 కోట్లు వడ్డీలకే!

హైదరాబాద్, అక్టోబర్ 2(నమస్తే తెలంగాణ): టెండర్లలో ధాన్యం దక్కించుకున్న బిడ్డర్లకు ధాన్యం ఎత్తేందుకు ఇచ్చిన గడువును పదేపదే పొడగిస్తుండటంతో పౌర సరఫరాల సంస్థపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సకాలంలో ధాన్యం ఎత్తకుండా, నిబంధనలను అతిక్రమిస్తున్న బిడ్డర్లపై ఉదాసీనంగా వ్యవహరించాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే రెండుసార్లు గడువు పొడగించిన సంస్థ.. మరోసారి పొడగించడంపై విమర్శలకు తావిస్తున్నది. అదే సమయంలో మిల్లర్లపై వివిధ రకాల తనిఖీల పేరుతో పౌరసరఫరాల సంస్థ ఉక్కుపాదం మోపుతున్నది. ఈ విధంగా మిల్లర్లు, బిడ్డర్లపై పౌరసరఫరాల సంస్థ ద్వంద్వ వైఖరిని అవలంభించడం అనుమానాలకు తావిస్తున్నది.

గడువించిన ధాన్యం ఎత్తని బిడ్డర్లు

2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించిన దాదాపు రూ.ఏడువేల కోట్ల విలువైన 35 లక్షల టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ గత జనవరిలోనే వేలం వేసింది. ఇందులో నాలుగు కంపెనీలు ధాన్యాన్ని దక్కించుకున్నాయి. ఫిబ్రవరి 23న ఈ కంపెనీలకు కన్ఫర్మేషన్ లెటర్లు జారీ చేసిన సంస్థ... 90 రోజుల్లో మొత్తం ధాన్యాన్ని తీసుకెళ్లాలని పేర్కొన్నది. కానీ, కంపెనీలు గడువులో ధాన్యాన్ని ఎత్తకపోవడంతో మరోసారి రెండు నెలల గడువు పొడగించింది. అయినప్పటికీ ఎత్తకపోవడంతో మరో రెండు నెలల గడువు ఇచ్చింది. ఇది కూడా సెప్టెంబర్ 23తో ముగిసింది. అప్పటికీ కంపెనీలు ధాన్యం ఎత్తలేదు. దీంతో డిసెంబర్ ఆఖరు వరకు మరోసారి గడువు పొడగించింది. ఇప్పటివరకు సదరు కంపెనీలు కేవలం రూ.రెండు వేల కోట్ల విలువైన 10 లక్షల టన్నులు మాత్రమే ఎత్తినట్టు తెలిసింది.

బిడ్డర్లపై ఈగ వాలనిస్తలేరా?

నిర్ణీత గడువులో టెండర్‌దారులు లక్ష్యాన్ని చేరుకోకపోతే వారిపై చర్యలు తీసుకోవడమనేది టెండర్ ప్రక్రియలో సాధారణ నిబంధన. కానీ, ధాన్యం ఎత్తడంలో విఫలమైన బిడ్డర్లలో ఏ ఒక్కరిపై కూడా పౌరసరఫరాల సంస్థ చర్యలు తీసుకోలేదు. దీంతో బిడ్డర్లతో అధికారులు కుమ్మక్కయ్యారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పౌర సరఫరాల సంస్థలోని పలువురు అధికారులు బిడ్డర్లపై ఈగ వాలకుండా చూసుకుంటున్నారని, బిడ్డర్లు ఎలా చెప్తే అలా వింటున్నారనే ప్రచారం జరుగుతున్నది. అధికారుల నిర్లక్ష్యం, బిడ్డర్లపై ఉదాసీనత కారణంగా పౌరసరఫరాల సంస్థపై ఆర్థిక భారం పడుతున్నది. ధాన్యం విక్రయం వల్ల మూడు నెలల్లో రూ.ఏడు వేల కోట్లు వస్తాయని సంస్థ అధికారులు చెప్పారు. కానీ, ఇప్పుడు అసలు 7వేల కోట్లు రాకపోగా.. వడ్డీ భారం పడుతున్నది. ప్రతి నెలా సుమారు రూ.50 కోట్ల వరకు పౌరసరఫరాల సంస్థ వడ్డీ చెల్లించాల్సి వస్తున్నది. ఇప్పటివరకు రూ.350 కోట్ల వరకు వడ్డీ చెల్లించినట్టు తెలిసింది. ఇప్పుడు డిసెంబర్ వరకు గడువు పొడగించడంతో ఈ భారం రూ.500 కోట్లకు చేరుతుందని ఆ సంస్థ అధికారులు అంచనా వేస్తున్నారు.

బిడ్డర్ల వసూళ్ల పర్వం

బిడ్డర్లు ధాన్యం ఎత్తకపోగా, ధాన్యానికి బదులు డబ్బులు ఇవ్వాలని మిల్లర్లను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. టెండర్‌లో సగటున క్వింటాల్‌కు రూ.రెండు వేల చొప్పున దక్కించుకోగా, ధాన్యం బదులుగా తమకు రూ.2,230 చొప్పున చెల్లించాలని మిల్లర్లను బిడ్డర్లు బెదిరిస్తున్నట్టు తెలిసింది.

ధాన్యం అమ్ముకున్న మిల్లర్లు?

పలువురు మిల్లర్లు కూడా ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అమ్ముకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు బడా మిల్లర్లు బాయిల్డ్‌రైస్‌ను తమిళనాడులో విక్రయించగా, మరికొంత భాగాన్ని విదేశాలకు దొడ్డిదారిన ఎగుమతి చేశారనే ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై ప్రభుత్వం విచారణ చేపట్టినట్టు సమాచారం. వరంగల్ జిల్లాకు చెందిన మణికంఠ కన్వేయర్స్ ద్వారా ఈ వ్యవహారం సాగినట్టు విజిలెన్స్ విభాగం గుర్తించింది. దీనిపై ఆయా మిల్లర్లకు నోటీసులు జారీ చేసింది.

వీసీ పదవులెవరిని వరించేనో?

- నేడు, రేపు సెర్చ్ కమిటీ సమావేశాలు
- ఆశావాహుల ముమ్మర ప్రయత్నాలు
- అన్ని సామాజికవర్గాలకు ప్రాధాన్యం

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రధాన వర్సిటీల్లో కొత్త వీసీల పేర్లను ఖరారు చేసేందుకు సెర్చ్ కమిటీ సమావేశాలు షురూ కావడంతో ఆ పోస్టులెవరిని వరిస్తాయోనన్న చర్చలు జోరుగా నడుస్తున్నాయి. బుధవారం తెలంగాణ వర్సిటీ సెర్చ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. గురువారం పాలమూరు, ఉస్మానియా, బీఆర్‌ఏవోయూ, తెలంగాణ వర్సిటీ సెర్చ్ కమిటీ సమావేశాలు జరగనున్నాయి. శుక్రవారం శాతవాహన, కాకతీయ, జేఎన్టీయూ సెర్చ్ కమిటీ సమావేశాలు జరగనున్నాయి. సచివాలయంలోని సీఎస్ చాంబర్‌లో సమావేశాలు జరగనుండగా, ప్రభుత్వవర్గాలు అత్యంత గోప్యతను పాటిస్తున్నాయి. రాష్ట్రంలోని 10 వర్సిటీల వీసీల పదవీకాలం మే 21తో ముగిసింది. ప్రస్తుతం ఇన్‌చార్జి వీసీలతోనే నెట్టుకొస్తున్నారు. పది వర్సిటీలున్నా ప్రధానంగా ఉస్మానియా, జేఎన్టీయూ వీసీ పోస్టులపైనే అత్యధికులు గురిపెట్టారు. కీలకమైన జేఎన్టీయూ వీసీ పోస్టుకు ఉత్తరాదిలోని ఓ ఎన్ఐటీకి చెందిన ప్రొఫెసర్ ప్రయత్నిస్తున్నట్టుగా ప్రచారం జరుగుతున్నది. ఓసీ సామాజికవర్గానికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ సీఎం ఆశీస్సులతో ఓయూ వీసీ పోస్టుకు పోటీపడుతున్నారు. ఓ యువ ఎమ్మెల్సీ సైతం తనకు కావాల్సిన వారికి ఇప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఉత్తర తెలంగాణకు చెందిన ఓ మంత్రి తనకు సన్నిహిత ప్రొఫెసర్‌కు ఇప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. కేయూకు చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ తన నియోజకవర్గం మంత్రి ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు. ఏపీలోని ఓ ప్రైవేట్ వర్సిటీ వైస్‌ఛాన్సలర్ ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రి ద్వారా ప్రయత్నాలు సాగిస్తున్నట్టు తెలిసింది. మైనార్టీ వర్గానికి చెందిన మరో ప్రొఫెసర్ కామారెడ్డి జిల్లాకు చెందిన కీలక నేతతోపాటు ఎంఐఎం కీలక నేతల ఆశీస్సులు కోరినట్టు తెలుస్తున్నది. పలువురు ప్రొఫెసర్లు సామాజిక అస్త్రాన్ని వాడుతున్నారు. తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

పీసీసీఎఫ్ వినయ్ కుమార్‌కు అశోక అవార్డు

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): డెహ్రాడూన్‌లోని ఇండియన్ కౌన్సిల్ ఆ